



# అఖిల భారత కళాయాత్ర!

పాదయాత్ర, సైకిల్ యాత్ర, మోటార్ సైకిల్ యాత్ర చేసేవాళ్లున్నారు. దేశమంతా చూసి రావడానికి ఇలా ఏదో ఒక యాత్రను ఎంచుకుంటూ ఉంటారు. ఆ యాత్రా విశేషాలను కథలుగా, కవితలుగా రాసేవారూ ఉన్నారు. ఈ యాత్రికుడు మాత్రం కళల విహారం చేశాడు. దేశమంతా తిరిగి.. మార్గంలో తన మనసు దోచిన అద్భుతమైన కట్టడాలను కాగితం మీద బంధించాడు. తనకు తారసపడిన అందమైన జీవితాలను బొమ్మల రూపంలో కళాత్మకంగా వర్ణించాడు. మంచిర్యాల జిల్లాకు చెందిన కళాపిపాసి ఏల్పుల పోచం సాగించిన కళాయాత్ర విశేషాలు ఆయన మాటల్లోనే..



మాది

మంచిర్యాల జిల్లా చెన్నూరు. అమ్మానాన్న వ్యవసాయకూలీలు. చిన్నప్పుడు నా చేతి రాత బాగుంటుందని అందరూ అనేవారు. చాలా చక్కగా రాసేవాణ్ని. కానీ, నా చేతి గీత కూడా బాగుంటుందని మా డ్రాయింగ్ టీచర్ సత్యనారాయణ సార్ చెప్పేదాక నాకు తెలియదు. చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఆయన.. 'నీ రైటింగ్ బాగుంది.. ఆర్ట్ నేర్చుకో' అన్నారు. ఆ మాట మీద బొమ్మలు గీయడం ప్రారంభించా. 'బొమ్మలు చక్కగా గీస్తే.. బతుకుదెరువుకు లోటుండదు' అన్న మా సార్ మాటలు బలంగా నమ్మాను. పదో తరగతి పూర్తయ్యాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాను. కాలేజీ ఒక్కపూటే ఉండేది. దాంతో మధ్యాహ్నం పూట సైన్ బోర్డులు రాసే సంకీర్తన ఆర్ట్స్‌లో చేరాను. అక్కడ రాజన్న అనే ఆర్టిస్ట్ దగ్గర రాయడం నేర్చుకున్నా. ఆయనే డిగ్రీలో ఫైన్ ఆర్ట్స్ కోర్సు ఉంటుందని చెప్పాడు. అలా జేఎన్‌టీయూ, తెలుగు విశ్వవిద్యాలయం ఎంట్రెన్స్ రాశాను.

**ఉద్యోగం వదులుకున్నా..**

నాకు జేఎన్‌టీయూలో సీటొచ్చింది. ఫీజు ఆరు వేల రూపాయలు. ఫస్ట్ ఇయర్‌కు హాస్టల్ కూడా ఉండదన్నారు. దాంతో ఆ సీటు వదులుకున్నా. తెలుగు యూనివర్సిటీలో చేరాను. ఊరికి వెళ్లినప్పుడు 'ఏం చదువుతున్నావ్' అని అడిగేవాళ్లు. 'బొమ్మల చదువు' అని చెబితే.. 'అరే.. బొమ్మలగ్గూడ సదువుంటదారా!' అనేవాళ్లు. వీడికి పిచ్చి ముదిరింది అనుకునేవాళ్లు. ఆ మాటలకు మా ఇంట్లోవాళ్లు కూడా కాస్త అనుమానంగా చూసేవాళ్లు. మొత్తానికి బీఎఫ్ఏ పూర్తయింది. డబ్బుల కోసం ఓ ఏడాదంతా బడి గోడలకు రంగులు వేసే ప్రాజెక్ట్‌లో చేరాను. ఛత్తీస్‌గఢ్‌లో ఎంఎఫ్ఏలో సీటు వచ్చింది. అక్కడ కూడా పార్ట్‌టైమ్ పనులు చేస్తూ చదువుకున్నా. పీజీ పూర్తయ్యాక జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్ట్ టీచర్‌గా చేరాను. ఆ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి నాకు ప్రాక్టీస్ లేకుండా పోయింది. కళలో నాకంటూ ఓ ప్రత్యేక శైలిని అభివృద్ధి చేసుకోవాలన్నది నా కల. అందుకోసం ఉద్యోగం మానేశాను. దేశమంతా తిరిగి ఎక్కడెక్కడ జనం ఎలా బతుకుతున్నారో చూడాలనుకున్నాను. కాగితాలు, రంగులు పట్టుకొని కళాయాత్ర మొదలుపెట్టాను.

**కాశీ మజిలీ కథ**

లక్ష రూపాయలతో నా యాత్ర మొదలైంది. ముందుగా వారణాసికి

